

● కాస్పాగ్ తండాలో..



● నర్సింగ్‌పల్లిలో రైతులు ఆరబోసిన ధాన్యం

పేరుకుపోతున్న.. ధాన్యం నిల్వలు

- జిల్లాలో ఎక్కడ చూసినా ధాన్యం రాశులే..
- పూర్తిస్థాయిలో ప్రారంభం కాని ధాన్యం కొనుగోళ్లు
- రోజుల తరబడి ఎదురు చూస్తున్న రైతులు
- చలి తీవ్రత, తేమ పెరగడంతో పంట ఆరబోతకు తిప్పలు
- త్వరగా కొనుగోళ్లను చేపట్టాలని డిమాండ్ చేస్తున్న రైతులు

నిజామాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఎక్కడ చూసినా ధాన్యం నిల్వలే. ఏ రోజుకు ఆ రోజు పంట కోస్తుండటంతో ధాన్యం నిల్వలు పెరిగిపోతున్నాయి. పంట చేతికి వస్తుండటం కొనుగోలు చేపట్టకపోవడం వల్ల ధాన్యం నిల్వలు అన్ని గ్రామాల పరిధిలో పేరుకుపోతున్నాయి. ధాన్యం పోసేందుకు స్థలాలు లేక రైతులు రోడ్లపై, పొలాల వద్ద ఆరబోస్తున్నారు. కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. చలి తీవ్రత పెరగడం తేమ ఎక్కువగా వస్తుండటంతో నిత్యం ఆరబోస్తూ తిప్పలు పడుతున్నారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం ముందస్తు ఆదేశాలు ఇవ్వకపోవడంతో ఇప్పటికే కొంత మంది రైతులు ప్రైవేటుకు ధాన్యాన్ని అమ్ముకోగా మిగతా రైతులు బోనస్ కోసం కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూస్తున్నారు. రోజుల తరబడి కుప్పల వద్దనే ఉంటూ కొనుగోళ్లు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో నాలుగు రోజుల క్రితం కొనుగోలు మొదలు పెట్టిన అధికారులు ఇంకా పెద్ద ఎత్తున సేకరించడం లేదు. జిల్లా వ్యాప్తంగా వెంటనే కొనుగోలు కేంద్రాలను తెరిచి పెద్ద ఎత్తున ధాన్యం కొనాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఆలస్యంగా ధాన్యం కొనుగోళ్లు..

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఈ సంవత్సరం ఆలస్యమైంది. ఇతర జిల్లాల కంటే ముందే వరిసాగు చేసిన రైతులు.. నెల పది రోజులుగా వరి కోతలను చేస్తున్నారు. ఇప్పటికే సగానికి పైగా కోతలు పూర్తి చేసిన రైతులు పూర్తిస్థాయిలో అమ్మకాలపై దృష్టి పెట్టారు. జిల్లా వ్యాప్తంగా వరి సాగు పూర్తికావడం మొత్తం కోతకు రావడం వల్ల అమ్మకాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కొనుగోళ్లను చేపట్టాలని కోరుతున్నారు. బోధన్ డివిజన్ పరిధిలో ముందే వ్యాపారులకు రైతులు ధాన్యాన్ని అమ్ముకున్నారు. పెద్ద రైతులు మాత్రం ధాన్యాన్ని బోనస్ కోసం నిలువ చేసి ఉంచారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఏ వైపు చూసినా ధాన్యం రాశులు కనిపిస్తున్నాయి. ప్రతీరోజు పంట చేతికి వస్తుండటంతో హార్వెస్టర్ల ద్వారా అధికారుల లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 10వేల ఎకరాలకు పైగా పంటలను కోస్తున్నారు. ఆ పంటను ఎక్కడ నిలువ

మిగతా 8వ పేజీలో...

వరి పంట కోసి ఇరవై రోజులైంది..

:ఎం.ప్రకాష్, రైతు (కాస్పాగ్ తండా)



మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. కోసి ఇరవై రోజులు అయింది. ఇప్పటి వరకు కొనుగోళ్లను చేపట్టలేదు. ధాన్యం నిల్వ చేసే పరిస్థితి లేక రోడ్లపై పోశాం. అధికారులు చర్యలు తీసుకొని వెంటనే కొనుగోలు ప్రారంభించాలి.

పదిహేను రోజులుగా ధాన్యం ఆరబోత..

:బాదావత్ నౌషా, రైతు, (నర్సింగ్‌పల్లి)



కొనుగోళ్ల లేక పదిహేను రోజుల నుంచి ధాన్యం ఆరబోస్తున్నాం. ప్రైవేటుకు అమ్ముదామంటే తక్కువ ధరకు కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం పట్టించుకొని మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

హామీలను విస్మరించిన సీఎం

● ఎంపీ ధర్మపురి అర్వింద్

నిజామాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల సమయంలో దేవుళ్ల మీద ఒట్లు వేసి ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయడం లేదని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్‌ను ఇవ్వడంతో పాటు ధాన్యం కొనుగోళ్లను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, జిల్లాకు ఒక్క ఇంటిగ్రేటెడ్ స్కూల్ రాకపోవడం శోచనీయమని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని ఎంపీ అన్నారు. కులగణన వెంటనే చేపట్టాలని, అన్ని వర్గాల వారి వివరాలను తీసుకోవడంతో పాటు పక్కాగా వివరాలను సేకరించాలన్నారు.

కేటీఆర్ పాదయాత్ర చేస్తాననడం విడ్డూరంగా ఉంది..

బీఆర్ఎస్ నేత కేటీఆర్ పాదయాత్ర చేస్తాననడం విడ్డూరంగా ఉందని ఎంపీ అర్వింద్ అన్నారు. పాదయాత్ర పదవుల కోసమా.. ప్రజల కోసమా చెప్పాలన్నారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు చీపుర్లు, చెప్పులతో స్వాగతం పలుకుతారని ఆయన అన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఉచితాల ప్రకటనలపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ అబద్ధపు హామీలను బయట పెట్టాయని ఆయన ఆరోపించారు. కర్నాటక, తెలంగాణ ఎన్నికల్లో ఆ పార్టీ ఉచితాలపై ప్రచారం చేసిందన్నారు. హామీలను అమలు చేసే ఏకైక పార్టీ బీజేపీయేనని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో హామీలన్నీ అమలు చేస్తున్నామని తెలిపారు.

ఎంఐఎం దేశానికి పట్టిన క్యాన్సర్ లాంటిది..

ఎంఐఎం పార్టీ దేశానికి పట్టిన క్యాన్సర్ లాంటిదని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలపై ఆరోపణలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నోరు మూయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వక్ఫ్ బోర్డు చట్టం దుర్మార్గపు చట్టం అని ఆయన అన్నారు. చట్టాలను ఎవరూ ఉల్లంఘించినా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి పాల్గొన్నారు.

సమాజ సంక్షేమమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

● ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర సంపర్క్ ప్రముఖ్ టీఎస్ వెంకటేశ్



కార్యక్రమానికి హాజరైన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు



మాట్లాడుతున్న వెంకటేశ్

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమాజ సంక్షేమమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని దక్షిణ మధ్య క్షేత్ర సంపర్క్ ప్రముఖ్ టీఎస్ వెంకటేశ్ అన్నారు. ఆదివారం శివాజీనగర్‌లోని ఐటీఐ కళాశాలలో నగర గణవేష్ ధారి సాంఘిక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు లోక హితం కోసమే పాటు పడుతారని అన్నారు. సమాజ హితం కోసం అవసరమయ్యే ప్రతీ పనిని ఆర్ఎస్ఎస్ కార్యకర్త తనపనిగా భావించి పూర్తి చేస్తారని అన్నారు. తమ కోసం కాకుండా దేశం కోసం పాటుపడేలా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పని చేస్తారని అన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు ఏ ఒక్కరికి వ్యతి రేకం కాదని, సమాజం కోసమేనని అన్నారు. ప్రతీ స్వయం సేవక్ తాము పనిచేస్తున్న ప్రతీ రంగంలో సమర్పణ భావంతో పనిచేయాలని ఆయన సూచించారు. దేశానికి సమస్య వచ్చిన ప్రతీసారి స్వయం సేవక్ ముందుండి పరిష్కారం కోసం పాటుపడు తుందన్నారు. కార్యక్రమంలో నగర కార్యవాహ అర్గుల సత్యం, సహకార్య వాహాలు సుమిత్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో స్నానానికి వెళ్లి ఇద్దరి మృతి

- ఈత రాక ప్రాణాలు కోల్పోయిన యువకులు
- మంచిప్ప దర్గాను దర్శించుకునేందుకు వచ్చిన హైదరాబాద్ వాసులు

మోపాల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మోపాల్ మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం మంచిప్ప వద్ద ఉన్న దర్గా దర్శనం కోసం ఆదివారం హైదరాబాద్‌లోని చెంచలగూడకు చెందిన సయ్యద్ వాసిక్ (32), సయ్యద్ యాకుబ్ (32) స్నేహితులతో కలిసి కారులో వచ్చారు. దర్శనం అనంతరం తమ మిత్రులతో కలిసి పక్కనే ఉన్న మంచిప్ప చెరువులో స్నానానికి వెళ్లారు. అయితే వీరిలో ఒకరు సయ్యద్ వాసిక్ ప్రమాదవశాత్తు చెరువులో మునిగి పోతుండగా గమనించిన సయ్యద్ యాకుబ్.. వాసిక్‌ను కాపాడే ప్రయత్నం చేయబోయి అతను కూడా నీటిలో మునిగిపోయాడు. దీంతో అక్కడే ఉన్న స్థానికులు వెంటనే వీరిని కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే వాసిక్ మృతి చెందగా, యాకుబ్ జాడ కనిపించకపోవడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి యాకుబ్ మృతదేహాన్ని బయటకు తీశారు. చెరువులో గుంతలు ఉండటం వల్ల ప్రమాదవశాత్తు ఆ గుంతలో పడి ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని స్థానికులు తెలిపారు. మృతదేహాలను నిజామాబాద్ ఆసుపత్రికి శవపంచనామా కోసం పంపించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.



సయ్యద్ వాసిక్, సయ్యద్ యాకుబ్ మృతదేహాలు

డ్రోన్‌తో పిచికారీ.. చిటికెలో పని పూర్తి



- పల్లెలకు విస్తరించిన వ్యవసాయ సాంకేతికత
- గంటకు ఐదారు ఎకరాల్లో ఎరువు పిచికారీ

7

ఇష్టారీతిన అభివృద్ధి పనులు!

- నాసిరకంగా చేపడుతున్న కాంట్రాక్టర్లు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న ఆర్మూర్ మున్సిపల్ అధికారులు
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు

6



● ప్రభుత్వం నిర్మించనున్న ఏటీసీ భవన నమూనా



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

జిల్లాలో ఐటీఐలకు కొత్త కళ!

- జిల్లాలో మూడు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ) ఏర్పాటు
- నిజామాబాద్, కమ్మర్‌పల్లి, బోధన్‌లలో నిర్మాణ పనులు
- ఒక్కో భవనానికి మూడున్నర కోట్ల మంజూరు
- రూ.32కోట్లతో ప్రత్యేక పరికరాలను సమకూరుస్తున్న టాటా కంపెనీ

నిజామాబాద్ అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు (ఐటీఐ)లకు కొత్త కళ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లను అధునాతన హంగులతో తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీ సెంటర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టగా జిల్లా కేంద్రంతో పాటు కమ్మర్‌పల్లి, బోధన్‌లలో ఏటీసీ సెంటర్ల నిర్మాణం ప్రారంభమైంది. ఏటీసీ సెంటర్లకు శాశ్వత నిర్మాణాల కోసం ఇప్పటికే పనులు ప్రారంభించారు. ఒక్కో ఏటీసీ సెంటర్‌కు మూడున్నర కోట్ల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఏటీసీ కేంద్రాల ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను వెంటనే కల్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ ఏటీసీ కేంద్రాల్లో మౌలిక వసతుల కోసం, వివిధ యంత్రాల కోసం ఒక్కో సెంటర్‌కు రూ.32 కోట్లు అందజేస్తుంది. అధునాతన కోర్సుల ద్వారా విద్యార్థులను ఆకట్టుకునేందుకు ఈ ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలలో అప్రెంటిషిప్, ఉద్యోగ అవకాశాలను కల్పించడంతో పాటు టాటా మోటార్స్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, కిర్లోస్కర్, మహేంద్రా అండ్ మహేంద్రా, హెచ్ఏఎల్, లాక్‌హీడ్, మార్టిన్, అమెరికా ఆధారిత కంపెనీ మొదలైన వంద కంటే ఎక్కువ కంపెనీలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఈ విద్యాసంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 25 ఏటీసీ కేంద్రాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించింది. గత నెల 30 వరకు అడ్మిషన్లను చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 25 ఏటీసీ కేంద్రాలలో జిల్లాలోని నిజామాబాద్ బాలుర ఐటీఐ, బోధన్, కమ్మర్‌పల్లి ఐటీఐలు ఉన్నాయి.

జిల్లాలో 334 అడ్మిషన్లు..

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఏటీసీ కేంద్రాల ద్వారా ఆరు అత్యాధునిక కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. జిల్లాలో ఈ విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. ఒక్కో ఏటీసీ కేంద్రంలో 172 సీట్లకు అనుమతి ఇవ్వగా జిల్లాలో గత నెల 30 వరకు నిర్వహించిన అడ్మిషన్ల ప్రక్రియలో 334 అడ్మిషన్లు అయ్యాయి. నిజామాబాద్ బాలుర ఐటీఐ ఏటీసీ కేంద్రంలో 172 సీట్లకు గాను 164 అడ్మిషన్లు కాగా, కమ్మర్‌పల్లిలో 172 సీట్లకు 80 అడ్మిషన్లు అయ్యాయి. బోధన్ ఐటీఐలో 172 సీట్లకు గాను 90 అడ్మిషన్లు అయ్యాయి.

ఆరు అధునాతన కోర్సులు..

రాష్ట్ర వ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రయోగాత్మకంగా 25 ఏటీసీ కేంద్రాలలో ఆరు అధునా తన కోర్సులతో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. మ్యానిఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రీయల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాని ఫ్యాక్చరింగ్, ఆర్టీసీయన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైర్, అడ్వాన్స్‌డ్ సీఎంసీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్స్ కోర్సుల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు కల్పించారు. ఇప్పటి వరకు ఐటీఐలలో ఫిట్టర్, ఎలక్ట్రిషి యన్, వెల్డర్స్, మోటార్ మెకానిక్స్, డీజిల్ మెకానిక్స్ తదితర కోర్సులు ఉండేవి. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి నామమాత్రంగానే ఉద్యోగ అవకాశాలు వచ్చేవి. లైన్‌మెన్, మెకానిక్, తదితర ఉద్యోగా లు మాత్రమే ఐటీఐ పూర్తి చేసిన వారు పొందేవారు.

మిగతా 8వ పేజీలో...

లోక కల్యాణార్థం శబరిమలకు మహా పాదయాత్ర



పాదయాత్ర ప్రారంభిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,నవంబరు3(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శబరిమలై వరకు మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సత్యం గురుస్వామి, మనీష్ స్వామి అన్నారు. ఆదివారం ఆయనతో పాటు మరి కొంతమంది అయ్యప్ప స్వాములు మహా పాదయాత్రగా శబరిమలైకు బయల్దేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ, తదితర ప్రాంతాల నుంచి అయ్యప్ప స్వాములు పాదయాత్రగా హైదరాబాద్ చేరుకుంటారని అక్కడ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే స్వాములను కలుసుకుని అక్కడి నుంచి సామూహికంగా పాదయాత్రతో అయ్యప్ప సన్నిధికి చేరుకుంటారన్నారు. అయ్యప్ప మాల దీక్ష చాలా పవిత్రమైందన్నారు. అయ్యప్ప స్వామి దీక్షలో ఉండి నిత్యం పూజలు చేస్తే కోరిక కోర్కెలు నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, రాములు, శశిభూషణ్, శ్రీనివాస్, శంకర్, తదితరులున్నారు.

ఘనంగా గోవర్ధన పూజా మహోత్సవం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):శ్రీకృష్ణుడు బృందా వన వాసుల రక్షణ కోసం ఐదు సంవత్సరాల చిరుప్రాయంలోనే చిటికెన వేలితో గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన సందర్భంగా ప్రతీ సంవత్సరం గోవర్ధన పూజ కార్యక్రమం నిర్వహిస్తామని ఇస్కాన్ ప్రతినిధులు జిల్లా అధ్యక్షుడు సిద్ధిబల రాం దాస్ బ్రహ్మచారి తెలిపారు. 5251 సంవత్సరాల క్రితం భక్తుల రక్షణ కోసం శ్రీకృష్ణుడు గోవర్ధ గిరిని ఏడు రోజుల పాటు చిటికెన వేలిపై గోవర్ధన పర్వతాన్ని ఎత్తుకున్నాడని ఆ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం ఈరోజు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా భజన, ధామోదరాష్టం, హారతి, గోవర్ధన పూజ, కార్తీక దీపారా ,దన, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కామారెడ్డి జిల్లాలకు చెందిన వారితో పాటు నిజామాబాద్ జిల్లా వాసులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవీపేట,నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చొరవతో మండలంలోని 16గ్రామాలకు చెందిన 37మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరయ్యాయి.10.14లక్షల విలువ చేసే సంబంధిత చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్‌రెడ్డి,బాల్‌రాజ్‌గౌడ్,మోస్రా సాయిరెడ్డి,భగవాన్, మహేందర్, విజయ్,వాసు, బిక్కు తదితరులున్నారు.

మత్తు పదార్థలకు ప్రజలు దూరంగా ఉండాలి



న్యావనందిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై ఎల్.రామ్

సిరికొండ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) గంజాయ్, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని సిరికొండ ఎస్సై ఎల్.రామ్ కోరారు. సిరికొండ మండలంలోని న్యావనంది గ్రామంలో ఆదివారం రాత్రి ప్రజలతో పోలీసులు మమేకం అనే కార్యక్రమాన్ని ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై రామ్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.డ్రగ్స్, గంజాయి ,గుట్కా లాంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యాలకు కాపాడుకోవాలని ఎస్సై కోరారు. మద్యం తాగి వాహనాలను నడుప రాదని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే భారీగా జరిమాన కేసులు ఉంటాయని ఆయన ప్రజలకు వివరించారు. ఎలిమెట్ ధరించి వాహనాలను నడిపించాలని ఆయన కోరారు.అధిక వేగంతో వాహనాలను నడపడం ప్రమాదకమన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాని ఎస్సై కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

బోర్ మెకానిక్‌గా మాజీ సొసైటీ చైర్మన్



బోర్‌ను రిపేర్ చేస్తున్న దృశ్యం

వర్ని,నవంబరు3(ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో సొసైటీ చైర్మన్‌గా పదవి అనుభవించిన మాధవ రెడ్డి తన స్థాయిని మెంటైన్ చేయకుండా మెకానిక్‌గా పని చేస్తున్నారు. ఎక్కడ నుంచి వచ్చాడో ఆ స్థాయిని మర్చి పోకుండా మెకానిక్ పనులు చేస్తున్నారు. గ్రామంలో ఎవరికైనా సమస్య వస్తే ముందుగా వెళ్లి వాళ్లను ఓదార్చి తనవంతు బాధ్యతగా సాయం చేస్తాడు. పదవులు శాశ్వతం కాదని నాయకుడు ప్రజల గుండెల్లో నిలిచి గ్రామస్థుల మన్ననలు పొందుతున్నారు.

సెపక్‌తక్రా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గాధారి సంజీవ్‌రెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఫతేమైదాన్ క్లబ్‌లో జరిగిన తెలంగాణ సెపక్ తక్రా అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా గాదారి సంజీవ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చామకూర భాగారెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎంపికైనట్లు నుడా చైర్మన్ కేశవేణు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి సెపక్ తక్రా జిల్లా అధ్యక్షుడు కేశవేణు, కార్యవర్గ సభ్యులు గంగారెడ్డి, దీపిక, సతీష్‌రెడ్డి, మీసాల ప్రశాంత్‌కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆర్మూర్‌టౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో మహిళ గురుకుల కళాశాల హాస్టల్‌లో విద్యార్థినిలు ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యార్థినులకు కాస్మోటిక్, డైట్ చార్జీలను పెంచినందుకు విద్యార్థినిలు కుటుంబసభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌సీడీవో రాజగంగారాం, హెచ్‌డబ్ల్యూవో సంతోష్, షబాన, విద్యార్థినిల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మాక్లూర్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ సూచించారు. ఆదివారం మాక్లూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, కొత్త చట్టాల గురించి అవగాహన కల్పించారు.

చేయూత ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

ఆర్మూర్‌టౌన్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్, ఆర్మూర్ పరిసర ప్రాంతాల్లో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నిరుపేదలు ఉండడానికి వసతులు లేక బస్టాండ్, పలు షాపుల ముందు నిద్రిస్తున్న వారిని గుర్తించి దుప్పట్లు పంపిణీ చేశారు.

ఇదేం పని తీరు ?

● గతంలో ఇష్టరీతిన కాంట్రాక్టర్‌ల పనులు ● పట్టించుకోని అధికారులు

ఆర్మూర్‌టౌన్,నవంబరు3(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని పలువురు కాంట్రాక్టర్‌లు ఇష్టరీతిన పనులను ముగిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదు.ఇదేం పనితీరు అంటూ ప్రజలు నోరెల్ల బెడుతున్నారు. గత మున్సిపల్ పాలకవర్గంలో మున్సిపల్ కార్యాలయంలో ఓకాంట్రాక్టర్ టౌన్‌ప్లానింగ్ శాఖలోని క్యాబిన్‌లో వేసిన గాచ్చు కొన్ని నెలలకే పాడైంది. దానిని రెండు సార్లు ప్యాచ్ వర్క్ చేసి సరిచేసిన మళ్లీ కొద్ది నెలలకే గాచ్చు పగిలిపోవడంతో నాణ్యత ఎలా పాటించరో అర్థమవుతుంది. అలాగే 19వార్డు విద్యనగర్ కాలనీలో డ్రైనేజీ నిర్మాణం రోడ్డుకు ఎత్తులో నిర్మించగా రోడ్డుకు మరో పక్క ఉన్న డ్రైనేజీ నీరు అందులోకి వెళ్లకుండా ఉంది. దీంతో ఓపెన్ ప్లాట్లలో డ్రైనేజీ నీరు నిలుస్తుంది. వర్షాకాలంలో రోడ్డుపైన పడ్డ నీరు రోడ్డుకు ఎత్తులో డ్రైనేజీ నిర్మించడంతో రోడ్డు పైనే నిలిచే అవకాశం ఉంది. కురిసిన వర్షాలకు కాలనీలో నివాసించే ప్రజలు తమ ఇళ్ల నుంచి బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయిందని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. అలాగే మరికొన్ని వార్డులలో డ్రైనేజీ నిర్మాణానికి నాణ్యత పాటించకుండా పనులను కొనసాగించారు. అలాగే డ్రైనేజీ లెవల్ చూడకుండా నిర్మించడంతో నీరు డ్రైనేజీల్లో నిలిచి దుర్గంధం రావడంతో ప్రజలు అనారోగ్యాల బారినపడుతూ తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. గతంలో ఓ వార్డులో అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టి మధ్యలో వదిలివేయడంతో పెద్ద మొత్తంలో ప్రజాధానం దుర్వినియోగం అయ్యింది. ఇలా లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులను చేపడితే అధికారులు నిమ్మకు నిరెత్తినట్టు కూర్చొవడం సరికాదని వారు పని చేసే ఆఫీసులోనే నాణ్యతను పరిశీలించలేకపోతున్నారంటే వివిధ వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎలా పరిశీలిస్తారని ప్రజలు అధికారుల పనితీరుపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. అమ్యామ్యాలకు ఆశపడి బిల్లులు చేస్తున్నారే తప్ప నాణ్యతను పట్టించుకోవడంలేదని ప్రజలు గుసగుసలాడుతున్నారు.. బాధ్యత లేని అధికారుల వల్ల ప్రజాధానం దుర్వినియోగం అవుతుందని, అభివృద్ధి పనులు కుంటుపడుతాయని ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరవాలని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం



రోడ్డు కంటే ఎత్తులో నిర్మించిన డ్రైనేజీ

ప్రభుత్వ పనులను అధికారులు పర్యవేక్షించాలి



ప్రభుత్వం ద్వారా జరిగే అభివృద్ధి పనులను అధికారులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలి. ప్రజాధనం దుర్వినియోగం కా కుండా కాపా డాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహారించడం సరికాదని అన్నారు.

- యామాద్రి భాస్కర్, ఆర్మూర్

కామ్రెడ్ డీవీకే స్మారక విగ్రహ ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలి

బోధన్‌రూరల్,నవంబరు3(ఆంధ్రజ్యోతి): కామ్రెడ్ డీవీకే స్మారక విగ్రహ ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలో కామ్రేడ్ కుమార్ నారాయణ భవనం వద్ద కామ్రెడ్ డీవీకే స్మారక విగ్రహ ఆవిష్కరణ సభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విప్లవోద్యమ కమ్యూనిస్టు యోధుడు, ప్రజాపంథా మార్గదర్శకుడు, అమరుడు డీవీకే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ నెల 9న ఆర్మూర్‌లో జరిగే డీవీకే స్మారక విగ్రహ ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. జిల్లాలో విప్లవ ఉద్యమానికి పునాదులు వేసి ఆనాటికి కుల వివక్ష అగ్రకుల అణచివేత, గ్రామీణ ప్రాంతాలలో ఓటర్లలలో రెండు గ్లాసుల పద్ధతికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్, మండల నాయకులు సాయిలు, నగేష్, ఈర్షద్, లక్ష్మణ్, గంగన్న, పోశెట్టి, రామన్న, రామారావు, లక్ష్మణ్ తదితరులున్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అర్గుల్‌లో దొంగ అరెస్టు

జక్రాన్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో మగ్గిడి గంగాధర్ ఇంట్లో పట్టపగలు చోరీ చేసిన కేసులో దొంగను అరెస్టు చేసినట్టు డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. ఆదివారం సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన మగ్గిడి గంగాధర్ ఇంట్లో గత నెల 18న మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో మహరాష్ట్రకు చెందిన ఆనంద్‌రావు, రాందేవ్ అలియాస్ జ్ఞానేశ్వర్ చొరబడి బంగారు ఆభరణాలు, డబ్బులు దొంగలించుకొని పరారీ అయ్యాడని తెలిపారు. బాధితుడు మగ్గిడి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి విచారణ చేపట్టామన్నారు. అర్గుల్‌లో సీసీ కెమెరాలు, ఇతర సాక్ష్యుల ఆదారలు బట్టి బాల్కొండ, వేల్పూర్ చుట్టు పక్కల ప్రాంతాల్లో దొంగతనాలు చేసి జైలుకు వెళ్ళిన మహారాష్ట్రకు చెందిన ఆనంద్‌రావు, రాందేవ్ అలియాస్ జ్ఞానేశ్వర్‌లుగా గుర్తించామని తెలిపారు. ఆదివారం సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై సీహెచ్.తిరుపతిలు పోలీస్ సిబ్బందితో కలిసి డిచ్‌పల్లి ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆనంద్‌రావు, రాందేవ్ అలియాస్ జ్ఞానేశ్వర్‌లు డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద పట్టుకొని అరెస్టు చేసినట్టు తెలిపారు. వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలను, ఒక సెల్‌ఫోన్ రికవరీ చేసి వెంటనే నిందితున్ని రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు.



చోరీ కేసులో దొంగను అరెస్టు చేసి చూపుతున్న డిచ్‌పల్లి సీఐ మల్లేష్,

ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులకు నిధుల మంజూరు

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

రామారెడ్డి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పేర్కొన్నారు. రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మరమ్మతు పనులకు సంబంధించి త్వరలో టెండర్లు జరుగుతున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం చేకూరుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోనే బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం ప్రత్యేక నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. గతంలో ఇచ్చిన హామీ లను ఏ మాత్రం తగ్గలేదని ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలపై మొగ్గు చూపకుండా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థిని విద్యార్థులను చదివించాలన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కష్టపడి శ్రమించి చదువులు చదివినప్పుడే విజయం సాధిస్తారని వివరించారు. నేను చిన్న తనంలో ఆరవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొల్లపల్లి లక్ష్మగౌడ్, మండల వర్కింగ్ అధ్యక్షుడు సామల శీలాసాగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, విండో చైర్మన్ సదాశివరెడ్డి, మాజీ జడ్పీటీసీలు నారెడ్డి మోహన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్‌రెడ్డి, మండల నేతలు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, జగన్, నరేంద్ర, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

ప్రతి ఒక్కరూ శాఖాహారం భుజించాలి

ఆర్మూర్‌రూరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు శాఖహారాన్ని భుజించి ధ్యానం చేస్తే మంచి ఫలితాలు పొందుతారని మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ ప్రధానకార్యదర్శి మారం శివప్రసాద్ అన్నారు. బాల్కొండ మండల కేంద్రంలో పీఎస్ఎస్ఎం నవనాథపురం కమిటీ నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం శాఖహర ర్యాలీ నిర్వహించారు. 11రోజులు శాఖ ఆహార ర్యాలీలు, ధ్యాన, జ్ఞాన కార్యక్రమంలో భాగంగా అంజనేయ పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద ధ్యాన జ్ఞాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవహింసా మహాపాపమని, మనవులందరు ప్రశాంతంగా జీవించాలంటే శాఖహారం తీసుకోవడం ఉత్తమమన్నారు. ఆర్మూర్‌రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ధ్యానం చేస్తే ప్రతీఒక్కరికి ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. ఆత్మహత్యలు, హత్యలు నిరోదించాలంటే ప్రతీఒక్కరు ధ్యానం చేసి జ్ఞానం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానదాత నర్సింహమూర్తి, పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి, రాజేందర్, దయానంద్, లక్ష్మణ్, అమర్‌వాజి శ్రీనివాస్, రాజేశ్వర్, కాపెల్లి చిన్న ముత్తెన్న, సాయినాథ్, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో వైద్య శిబిరం

భీమ్‌గల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్కూర్ గ్రామంలో శ్రీ శివ సాయి మల్టిస్పెషాలిస్టు ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం విజయవంత మైంది. భీమ్‌గల్‌లోని శివసాయి మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన 20వ ఉచిత వైద్యశిబిరంలో 380మందికి వైద్యచికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ సాయి కుమార్‌యాదవ్, డాక్టర్‌లు సూర్యనారాయణ, శ్రీరామ్, ప్రదీప్తి, అనిల్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ముచ్కూర్‌లో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

భిక్కనూరు, నవంబరు 3: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాల, సిద్ధరామేశ్వరనగర్ శివారులో గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలను పరిశీలించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠశాలల ఆవరణలు అధ్వానంగా ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.



జంగంపల్లి జ్యోతిభా పూలే పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతి కార్యకర్త ఇప్పటి నుండే సైనికుడిలా పనిచేసి మేజార్టీ సీట్ల సాధనకు కృషిచేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం భిక్కనూరు మండల బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని మండల అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన మండలంలోని బస్వాపూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే ప్రతిఒక్కరికి పదవులు లభిస్తాయని, పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని 100శాతం విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీ అర్వింద్‌ను సన్మానించిన మునిపల్లి వీడీసీ సభ్యులు

జక్రాన్‌పల్లి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణానికి రూ.4లక్షల 95వేల నిధులను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద మంజూరు చేసినట్టు గుత్ప లిఫ్ట్ ప్రధాన కమిటీ చైర్మన్ బీజేపీ నాయకుడు వాకిల్ గంగారెడ్డి తెలిపారు. ఆదివారం ఈ నిధులు మంజూరు ప్రొసిడింగ్ పత్రాన్ని ఎంపీ అర్వింద్ మునిపల్లి వీడీసీ సభ్యులకు, బీజేపీ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను వీడీసీ సభ్యులు, బీజేపీ నాయకులు శాలువ, పూలమాలతో సత్కరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



పొతంగల్‌లో క్రీడకారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కోటగిరి,నవంబరు3(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలో పీఎస్ఆర్, కేబీఆర్ టోర్నీ పేరుతో నిర్వహించిన వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హజరయ్యారు. పొతంగల్, సులేమాన్ నగర్ టీమ్‌ల మధ్య జరిగిన ఫైనాల్ వాలీబాల్ పోటీలను తిలకించారు విజేత జట్టుకు 11,111రూపాయల నగదు, రన్నర్ జట్టుకు 5555రూపాయల నగదు బహుమతి, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, టోర్నీ నిర్వాహకులు గంధపు రాజు, గంధపు దత్తు, నాయకులు పవన్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మన్మథ స్వామి ఆయాలనికి పాదయాత్ర ప్రారంభం



సుంకిని నుంచి ప్రారంభమైన పాదయాత్ర దృశ్యం

కోటగిరి,నవంబరు3(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని సుంకిని గ్రామం నుండి ఆదివారం మహరాష్ట్రలోని బీడ్ జిల్లాలోని కపిలధార్ మన్మథ స్వామి ఆయాలనికి పాదయాత్ర ప్రారంభమైంది. వీరశైవ, జంగము లింగాయత్ సమాజ్, ప్రముఖ సిద్ది లింగాప్ప మహరాజ్ ఆధ్వర్యంలో బోధన్ నుండి ప్రారంభమైన పాదయాత్ర శనివారం రాత్రి సుంకిని గ్రామానికి చేరుకుంది. గ్రామంలో ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన కీర్తనలతో తిరిగి కపిలధార్‌కు పాదయాత్ర ప్రారంభమైంది. 330కిలో మీటర్ల దూరంలో ఉన్న మన్మథ స్వామి పుణ్యక్షేత్రానికి భక్తులు 15రోజుల పాటు పాదయాత్ర కొనసాగిస్తారు. మార్గమధ్యంలో మహరాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుండి సైతం భక్తులు మహపాదయాత్రలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలి



రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని సన్మానిస్తున్న జక్రాన్‌పల్లి నాయకులు

జక్రాన్‌పల్లి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదివారం జక్రాన్‌పల్లి కాంగ్రెస్ నాయకులు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను భూపతిరెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.జక్రాన్‌పల్లి ఉన్న సమస్యలను పరిష్కరిస్తారనని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్రాన్‌పల్లి మాజీసర్పంచ్ కాట్‌పల్లి నర్సా రెడ్డి, మండల కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్వింద్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని

మోర్తాడ్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని రితిక 70వ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల పీఈటీ సింధుజ తెలిపారు. ఆదివారం తిమ్మాపూర్ పాఠశాలలో పోటీలకు ఎంపికైన విద్యార్థిని రితికను పాఠ శాల హెచ్ఎం తమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు, వీడీసీసభ్యులు అభినందించారు.

జాతీయ స్థాయి కథల పోటీలో ఏర్గట్ల విద్యార్థి ప్రతిభ

ఏర్గట్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ అలాగే మాచి రాజు సాహిత్య కళాపీఠం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీలో విద్యార్థి అవినాష్ మంచి మనసు అనే కథకు గాను బహుమతి లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ దాసరి వెంకటరమణ, నేషనల్ బుక్ ట్రస్ట్ కన్వీనర్ మోహన్, సాహిత్య కళా పీఠం అధ్యక్షుడు కామేశ్వర్ రావు చేతుల మీదుగా బహుమతి ప్రశంస పత్రంను విద్యార్థి అవినాష్‌కు అందజేయడంతో పాటు తెలుగు పండితుడు ప్రవీణ్ శర్మను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారితో పాటు ఉపాధ్యాయుల బృందం వారికి అభినందలు తెలిపారు.

ట్రాక్టర్ - బైక్ ఢీ.. ఒకరి మృతి

బీర్కూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం దామరంచ గ్రామ శివారులో ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. రైతు నగర్ గ్రామానికి చెందిన చాకలి రాము (28)కు గేదెలు ఉన్నా యి. పశువులు కాస్తూ పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాము పాలు తీసుకుని ద్విచక్ర వాహనంపై బాన్సువాడకు వెళుతున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాము అక్కడికక్కడే మృతి చెందాడు. రాము వాహనం పై వెనుక కూర్చున్న వీరాపూర్‌కు చెందిన రవీందర్ స్వల్ప గాయాలతో బటయపడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బీర్కూర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేపట్టారు.

సిద్ధరామేశ్వర ఆలయంలో కార్తీక దీపారాధన

భిక్కనూరు, నవంబరు 3: మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్ర ఆయలంలో కార్తీకమాస ఉత్సవాలు కొన సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేద బ్రహ్మణుల మంత్రోచ్చరణల నడుమ ఆకాశ దీపం ఏర్పాటు చేయ గా రాత్రి పెద్దఎత్తున భక్తులు ఆయల ప్రాంగణంలో దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.





భిక్కనూరు శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో దీపారాధన, ఆకాశదీపం

ఫోకస్



● డ్రోన్‌తో పిచికారీ చేస్తున్న దృశ్యం

పల్లెలకూ సాంకేతికత

వ్యవసాయంలో సాంకేతిక యంత్రాలు ఒక్కొకటిగా వచ్చి చేరుతున్నాయి. ఒకప్పుడు ట్రాక్టర్‌లు, ప్రావ్‌లు, వరి నాటు యంత్రాలు, కోత మిషన్లు ఇలా అనేకం వచ్చి చేరాయి. వ్యవసాయ రైతులకు యంత్రాలతో శ్రమ తగ్గుతోంది. అలాగే ఖర్చు కూడా తగ్గి కలిసి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. రోజులు పట్టే పని కొన్ని నిమిషాల్లోనే పూర్తవుతోందని చెప్తున్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

- పల్లెలకూ విస్తరించిన వ్యవసాయ సాంకేతికత
- డ్రోన్‌తో పంటలకు మందుల పిచికారీ
- చిటికెలో పని పూర్తి
- గంటలో ఐదారు ఎకరాల్లో మందు పిచికారీ
- ఖర్చులతోపాటు సమయమూ ఆదా అవుతోందంటున్న రైతులు

కోటగిరి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు పిచికారీ చేసేందుకు అప్పట్లో చేతితో పంపులోకి గాలి కొట్టి చేతి పంపుల ద్వారా చేసేవారు. తైవాన్ స్ప్రేయర్లు అందుబాటులోకి రాగా పెట్రోల్, డీజిల్‌తో గాలికొట్టే పనిలేకుండా పిచికారీ చేశారు. నేడు డ్రోన్‌లతో అతితక్కువ సమయంలో ఎకరాలకు ఎకరాలు తక్కువ ఖర్చుతో పిచికారీ చేసే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు ఇది గ్రామాలకు చేరుతున్నాయి. రైతులు డ్రోన్‌లతో వరి పొలాలు, పత్తి చేనులలో డ్రోన్ సహాయంతో పిచికారీ చేస్తున్నారు. గంటకు ఐదు నుంచి ఆరు ఎకరాలకు పైగా పిచికారీ చేయడంతో ఎకరానికి కేవలం సుమారు 600రూపాయలు ఖర్చు అవుతోంది. దీంతో సమయం ఆదాతోపాటు కూలీల కొరతను అధిగమించే అవకాశం ఉంది. తక్కువ నీటితో ఎక్కువ పంటకు పిచికారి చేసే వీలుంది. పైగా డ్రోన్ రెక్కల గాలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పంటపై ఉన్న క్రిమికీటకాలు సైతం నీటిలో పడి చనిపోతున్నాయని రైతులు తెలిపారు. ఒక గంటలో ఐదారు ఎకరాలు పిచికారి చేయవచ్చని డ్రోన్ నిర్వాహకులు తెలిపారు. పంటకు అవసరమైన సమయంలో రసాయనాలు పిచికారి చేయడంతో దిగుబడులు సైతం గణనీయంగా పెంచుకునే అవకాశం ఉంది.

● పత్తి చేళ్లలలో..

పత్తి చేళ్లలలో కేవలం 10 నిమిషాల్లో ఎకరం పత్తి చేను పిచికారీ చేసే అవకాశం ఉంది. 10 లీటర్ల పురుగు మందు నీళ్లు కలిపిన ద్రవాణాన్ని డ్రోన్ మోసుకునిపోయి పొలం చుట్టు తిరిగి పిచికారీ చేస్తుంది. ఎకరానికి రైతులు రూ.400 చొప్పున డ్రోన్ నిర్వాహకులకు చెల్లిస్తున్నారు. గతంలో పురుగు మందులు చల్లాలంటే ఎంతో సమయం పట్టేదని ప్రస్తుతం క్షణాల్లో పని పూర్తవుతుందని రైతులు పేర్కొంటున్నారు.


కూలీల కొరతను అధిగమించవచ్చు



● అర్జున్, రైతు, హెగ్డోలి

పంటలపై రసాయనాల పిచికారీకి కూలీల కొరతఎక్కువ కావడంతో సకాలంలో క్రిమిసంహారకాలు, రసాయనాలు నీటిలో కరిగే పోషకాలు పంటలకు అందించలేకపోతున్నాం. తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంతో పిచికారీ చేయడంతో తక్కువ కూలీలతో పని చేసుకోవచ్చు. డ్రోన్‌లు మరిన్ని అందుబాటులోకి రావాలి.

డ్రోన్ ఖర్చు రూ.5లక్షలు



● మురళీ, కోటగిరి

డ్రోన్ కొనేందుకు 5లక్షల రూపాయలు ఖర్చు అయింది. ఒక్క సీజన్‌లో వెయ్యి ఎకరాలకు పైగా పిచికారీ చేస్తున్నాం. గంటకు ఆరు ఎకరాలకు పైగా పిచికారీ చేసే అవకాశం ఉంది. ఒక్క రోజులో 40 నుంచి 50 ఎకరాలు పిచికారీ చేస్తున్నాం. ఎకరానికి రైతుకు కేవలం 400 రూపాయలు మాత్రమే ఖర్చు అవుతుంది.

ఇటుక బట్టీలకు కోసం

యథేచ్ఛగా చెట్ల నరికివేత!

● అనుమతుల్లేకుండా చెట్లపై గొడ్డలి వేటు ● పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు ● గ్రామాల నుంచి కట్టెల మిల్లులకు కూడా తరలింపు

ఎల్లారెడ్డి, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పచ్చని చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నరికేస్తున్నారు. ఆ కట్టెలను పట్టణాల్లో సామిళ్లు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. కలప స్మగ్లర్లు ఈ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. గ్రామాలలోని పంట పొలాలలో బీడు భూములలో ఉన్న విలువైన చెట్లను నరికి తరలించాలంటే అటవీ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో కలప స్మగ్లర్లు ఎలాంటి అనుమతి పత్రాలూ లేకుండా గ్రామీణ ప్రాంతాల భూముల్లో ఉన్న చెట్లను నరికి వేసి కట్టే మిల్లులకు ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా జంకు బొంకు లేకుండా చెట్లను నరికి తరలిస్తున్నారు. అయితే ఈ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అటవీ శాఖ అధికారులు పర్యావరణాన్ని కాపాడాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో కట్టే వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఈ దందాను అధికారులు అడ్డుకోకుండా వారిని మజ్జిగ చేసుకుని వాల్టా చట్టాన్ని తమకు అనుకూలంగా మలుచుకుని కలప స్మగ్లర్లు దళారులు రెచ్చిపోతున్నారు.

● పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి లింగంపేట్, గాంధారి నాగిరెడ్డిపేట్ మండలాల పరిధిలో అన్ని గ్రామాలలోని వ్యవసాయ భూముల్లో బీడు భూములలో ఉన్న రకరకాల చెట్లను అనుమతులు లేకుండా చెట్లను నరికి కట్టెను కలప స్మగ్లర్లు ఇటుక బట్టీలకు కట్టే మిల్లులకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ రవాణాదారులు స్మగ్లర్లు అడ్డు అదుపు లేకుండా వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసం దాడులు చేసిన దాఖలాలే లేకపోవడంతో అధికారుల పనితీరుపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరో ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులు మెప్పు పొందడానికి తూతూ మంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారే తప్ప అక్రమ కలప రవాణాలను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. వాస్తవంగా అటవీ శాఖ అధికారుల అనుమతితో పాటు సంబంధిత గ్రామ పంచాయతీ నుంచి ఈ చెట్లను నరికి తరలించడం వల్ల పర్యావరణానికి నష్టం ఉందని సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆచరణలో మాత్రం కలప రవాణాదారులు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్నారు.



జర దేఖో!!

ఇటుక బట్టీల వద్ద కలప



● ట్రాక్టర్‌లో తరలిస్తున్న అక్రమ కలప

● ఇటుక బట్టీలకు వందల ట్రిప్పులు తరలింపు

ఇటుక బట్టీలు కాల్చడానికి కలప తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. దీంతో అడ్డగోలుగా చెట్లను నరికి గ్రామీణ ప్రాంతంలోని ఇటుక బట్టీలకు కలప తరలిస్తున్నారు. అటవీ చట్టం ప్రకారం చింత చెట్లను మోదుగు చెట్లను నరికి తరలించకూడదు ఇలా చేస్తే కఠినమైన శిక్షలు ఉంటాయి. అయిన ఇవేమీ పట్టనట్లు అన్నిరకాల చెట్లను నరికి ఇటుక బట్టీకు మరికొన్ని కట్టే మిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోకపోతే పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని పలువురు వాపోతున్నారు.



గండివేట్ గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

లోవోల్టేజీని పరిష్కరించరూ!

● ట్రాన్స్‌కో అధికారులకు గండివేట్ గ్రామస్థుల మొర

గాంధారి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండలంలోని గండివేట్ గ్రామంలో లోవోల్టేజీ సమస్యతో గ్రామంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గండివేట్ గ్రామంలో గత కొన్నిరోజులు గ్రామంలోని కొన్ని వార్డులలో విద్యుత్ సమస్య లోవోల్టేజ్ కారణంగా నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో సబ్‌స్టేషన్ ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. గత కొన్నిరోజుల నుంచి గ్రామంలో లోవోల్టేజీ సమస్యను విద్యుత్ అధికారులకు వివరించినా ఎవరూ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా అందరూ ఒకేసారి విద్యుత్ వినియోగించడంతో ఫేజ్‌వైర్లు కాలిపోతుండడంతో రాత్రివేళలో ఇబ్బందులు పడుతున్నారు. ఫేజు వైర్లు వేయాలన్న రాత్రివేళలో ఏదైన ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. మండలంలోని ప్రధానమైన గ్రామాలలో గండివేట్ మేజర్ గ్రామపంచాయతీ కానీఇక్కడ సమస్యలు మాత్రం ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ దీనికంటే ఎక్కువ కెపాసిటీ ఉన్నది ఏర్పాటు చేస్తే ఇక్కడ సమస్య పరిష్కారం అవుతుంది అదనంగా మరొక సింగిల్‌ఫేజ్ బుడ్డి ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి గ్రామస్తుల సమస్యలు పరిష్కరించేదిశగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

బాబల్‌గామ్ సమస్య

పరిష్కరించేదెన్నడో?

ఆంధ్రజ్యోతి పరిశీలన

● ఒక గ్రామం - మూడు మండలాలు - రెండు జిల్లాల పంచాయితీ ● విభజనతో ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి
● శాసన సభ ఓట్లు ఒకవైపు, పంచాయతీ ఓట్లు మరోవైపు ● మూడు మండలాల పరిధిలో పలు కార్యాలయాలు
● జుక్కల్ మండలంలోనే కొనసాగించాలని గ్రామస్థుల వినతి



గ్రామంలోని పంచాయతీ భవనం



బాబల్‌గామ్ గ్రామంలోని ప్రధాన రహదారి

పెద్దకొడప్‌గల్, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): సహజంగా గ్రామాల్లో ఉన్న ప్రజలకు ప్రభుత్వం నుంచి ఏదైనా అవసరం పడితే ఒక మండలానికి వెళ్లి పనులు చేసుకుంటారు. తమకు ప్రభుత్వం నుంచి ఏ సంక్షేమ పథకం అందాలన్నా ఒక మండలంలోనే సేవలు పొందుతారు. కానీ కామారెడ్డి జిల్లాలో మారుమూల ప్రాంతంలో ఉన్న గ్రామం బాబల్‌గామ్ గ్రామప్రజలు మాత్రం తమ కు ప్రభుత్వం ద్వారా పనులు కావాలంటే మూడు మండలాలతోపాటు రెండు జిల్లా కేంద్రాలకు వెళ్లిల్సిన పరిస్థితి నెలకొంది. గత సంవత్సర కాలంగా బాబల్‌గామ్ గ్రామస్థులు తమకు ప్రభుత్వపరంగా ఏ పనులు కావాలన్నా మూడు మండలాలతోపాటు రెండు జిల్లా కేంద్రాలకు వెళ్తున్నారు.

బాబల్‌గామ్ గ్రామం జుక్కల్ నియోజకవర్గ పరిధిలో ఉండగా, ఇటు సంగారెడ్డి జిల్లాకు, అటు కర్నాటక రాష్ట్రానికి సరిహద్దులో ఉంటుంది. గత పదేళ్ల క్రితం వరకు ఈ గ్రామం ద్వీపకల్పంగా ఉండేది. ఈ గ్రామానికి గతంలో ఎవరూ వెల్లాలన్నా ఒకవైపు నుంచి మాత్రమే దారి ఉండేది. లేదంటే జుక్కల్ మండలం నుంచి రావాలంటే మాత్రం పుట్టిలో మాత్రమే వీలుండేది. అయితే ఈ గ్రామానికి ఉన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గతంలో జుక్కల్ ఎమ్మెల్యేగా పనిచేసిన హన్మంత్‌షిండే ఈ గ్రామానికి తన హయాంలో నిధులు మంజూరు చేయించి గ్రామానికి వంతెన నిర్మాణం చేయించడంతోపాటు బీటీ రోడ్డు వేయించారు. దీంతో అప్పటి నుంచి ఈ గ్రామానికి ఇతర గ్రామస్థులు తమ తమ పనుల నిమిత్తం పుట్టిలో కాకుండా రహదారి వెంట ప్రయాణం సాగిస్తున్నారు.

గ్రామం చుట్టూ కౌలాస్‌నాలా నీరు చుట్టుకుని ఉండటంతో బాబల్‌గామ్ గ్రామస్థులు కౌలాస్‌నాలా నీటినే నమ్ముకుని వ్యవసాయం చేస్తున్నారు. రహదారి నిర్మాణం జరగడంతో గ్రామస్తులు సంతోషిస్తున్న తరుణంలో తమకు కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం కంటే తమకు సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం దగ్గరగా ఉంటుందని, ఆ మండలంలో తమకు విలీనం చేయాలని గ్రామస్థులు కోరడంతో గత ఆరేళ్ల క్రితం బాబల్‌గామ్ గ్రామాన్ని సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో విలీనం చేశారు. విలీన సమయంలో జరిగిన ప్రక్రియలో భాగంగా అప్పట్లో గ్రామస్థులు శాసనసభ ఎన్నికల్లో జుక్కల్ ఎమ్మెల్యేను గెలిపించారు. అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల ప్రజాప్రతినిధులకు ఓటువేశారు. దీంతో అప్ప టి నుంచి సంగారెడ్డి జిల్లాలోనే ఉన్న బాబల్‌గామ్ గ్రామస్థులు తిరిగి తమకు సంగారెడ్డి జిల్లా అనుకూలంగా లేదని, కామారెడ్డి జిల్లాలో కలపాలని విజ్ఞప్తి చేయడంతో ఈ గ్రామాన్ని పెద్దకొడప్‌గల్ మండలంలో చేరుస్తున్నట్లు అధి కారులు జీవో జారీచేశారు, పెద్దకొడప్‌గల్ మండలంలో చేర్చుతున్నట్లు ప్రకటించడంతోపాటు రెవిన్యూ, విద్యా, ఉపాధిహామీ పథకం వంటి వాటిని పెద్ద కొడప్‌గల్ మండలం నుంచి సేవలు పొందాలని గ్రామస్థులకు సూచించారు. మిగతా శాఖలకు సంబంధించిన సేవలు కంగ్టి, జుక్కల్ మండలం నుంచి ఉండగా మూడు శాఖలు మాత్రం పెద్ద కొడప్‌గల్ పరిధిలోకి వచ్చాయి, ఇక ఆ నాటి నుంచి ఏదైనా పని పడితే గ్రామస్థులు ముందుగా ఆ సేవలు ఏ మండలంలో ఉన్నాయో తెలుసుకున్న తర్వాతనే మండలానికి వెళ్తున్నారు.



గ్రామాన్ని చుట్టుముట్టిన కౌలాస్ నాలా నీరు

జుక్కల్‌లో మూడు శాఖల సేవలు

గతంలో బాబల్‌గామ్ జుక్కల్ మండలంలో ఉండగా ప్రస్తుతం విద్యుత్, బ్యాంకు, పోస్టాఫీస్ సేవలు జుక్కల్ మండలం నుండే అందుతున్నాయి. జుక్కల్ మండల పరిధిలోని కల్లాలి పీడర్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుండగా, ఖండెబల్లూర్ గ్రామం నుంచి తపాలా సేవలు అందుతున్నాయి. ఇక బ్యాంకులకు సంబంధించి గ్రామస్థులంతా తమ లావాదేవిలు జుక్కల్ మండల పరిధిలో ఉన్న బ్యాంకుల ద్వారానే చేస్తున్నారు.

పెద్దకొడప్‌గల్ పరిధిలో మరో మూడు శాఖల సేవలు

సంగారెడ్డి జిల్లా నుంచి తమకు కామారెడ్డి జిల్లా పరిధిలోకి మార్చాలంటూ బాబల్‌గామ్ గ్రామస్థులు విన్నవించగా అధికారులు గత సంవత్సరం కిందట బాబల్‌గాం గ్రామాన్ని కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలానికి మార్చారు. ఈ మార్పులో భాగంగా బాబల్‌గామ్ గ్రామస్థులు రెవిన్యూ, విద్యా, ఉపాధిహామీ సేవలు ఈ మండలం నుంచే పొందాలని సూచించారు. దీంతో అప్పటినుంచి ఈమూడుశాఖలు ఈ మండలం నుంచే అందుతున్నాయి.

కంగ్టి మండలంలో ఇతర సేవలు

ప్రస్తుతం బాబల్‌గామ్ గ్రామం పెద్దకొడప్‌గల్ మండల పరిధిలోఉన్న పోలిస్, వ్యవసాయం, ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, అటవీ, పశు సంవర్ధక, పంచాయతీరాజ్, ఫైర్, గ్రామీణ నీటిపారుదల, ఇరిగేషన్, ఐకేపీ, పౌరసరఫరా లాంటి శాఖలు ఇంక కంగ్టి మండల పరిధిలోనే ఉన్నాయి. దీంతో గ్రామస్థులు తమకు పని ఏ శాఖతో అవసరం ఉందో ముందే తెలిసిన వారిని అడిగి ఆ మండలానికి వెళ్లి పనులు చేయించుకుంటున్నారు.

రెండు జిల్లా కేంద్రాలలో పనులు

బాబల్‌గామ్ గ్రామం అటు కంగ్టి మండల పరిధిలో ఉండటంతో కంగ్టి మండల పరిధిలో ఉన్న పనులు కాకుంటే సంగారెడ్డి జిల్లా కేంద్రానికి, ఇటు జుక్కల్ మండలంతోపాటు పెద్దకొడప్‌గల్ మండలం కామారెడ్డి జిల్లా పరిధిలో ఉండటంతో కామారెడ్డి జిల్లాకేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. దీంతో తమ బతుకులు ఒక గ్రామ పంచాయతీ మూడు మండలాలు రెండు జిల్లాల ఆటగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జుక్కల్ మండలంలోనే కొనసాగించాలని వినతి

తమ గ్రామం గతంలో జుక్కల్ మండలంలోనే ఉండేదని ఆ సమయంలోనే తమకు ప్రభుత్వం నుండి అన్ని రకాలు సేవలు సక్రమంగా అందాయని, తాము గతంలో చేసిన చిన్న పొరపాటు వలన తమ గ్రామం మూడు మండలాల పరిధిలోకి వెళ్లిందని తిరిగి అధికారులు ఎలాగైనా తమ గ్రామాన్ని జుక్కల్ మండలంలోనే కొనసాగించాలని అటు ప్రజాప్రతినిధులతో పాటు, అధికారులను కోరుతున్నారు. మరి ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామస్థులు కోరిక ఎప్పుడు నెరవేరుస్తారో వేచి చూడాల్సిందే మరి.

మా గ్రామాన్ని జుక్కల్‌లో కలపాలి



● అశోక్ గ్రామస్థుడు, బాబల్‌గామ్

మా గ్రామం గత ఆరేళ్ల క్రితం జుక్కల్ మండలంలో ఉండేది. ఆ సమయంలో అన్నిరకాల సేవలు జుక్కల్ మండలం నుంచే అందేవి. గ్రామానికి సరైన రహదారి లేకున్నా అధికారులు పుట్టిలో వచ్చి మాకు సేవలు అందించేవారు. అయితే బీటీ రహదారి నిర్మాణమైన కంగ్టి మండలం దగ్గరగా ఉండటంతో ఆ మండలంలో చేరాం. అయితే మాకు కంగ్టి మండలంలో అనుకున్న విధంగా ప్రభుత్వ సేవలు అందడం లేదు. అందుకే తిరిగి మా గ్రామాన్ని జుక్కల్ మండలంలో కలపాలని కోరుతున్నాం.

మాకు సేవలు ఎవరు అందిస్తారు..



● శివారెడ్డి, రైతు, బాబల్‌గామ్

మా గ్రామం కంగ్టి మండలంలో ఉన్న సమయంలో వ్యవసాయం కోసం కంగ్టి వాణిజ్య బ్యాంకులో రూ. 50వేల పంటరుణం తీసుకున్నా. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడంతో నాకు రూ.50 వేల రుణంమాఫీ అయ్యింది. కంగ్టి మండలంలో ఉన్న బ్యాంకు కు వెళ్తే గ్రామం పెద్దకొడప్‌గల్ మండలానికి బదిలీ అయ్యిందని రుణం ఇవ్వలేదు. దీంతో నేను జుక్కల్ బ్యాంకుకు వెళ్లిం రుణం అడగాలా లేక పెద్దకొడప్‌గల్ బ్యాంక్‌కు వెళ్లి అడగాలా తెలియడంలేదు. రుణమాఫీకి సంతోషించాలో లేక కొత్త రుణం రాలేదని బాధపడాలో తెలియడం లేదు.

అయ్యప్ప ఆలయంలో మహా అన్నదానం ప్రారంభం

● ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్‌అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకుంటే శబరి ఆలయాన్ని దర్శించుకున్న అనుభూతి భక్తులకు కలుగుతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం అయ్యప్ప ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప స్వాములకు బిక్ష వడ్డన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప మాల అంటేనే నిగ్రహానికి నిదర్శనం అని కామ, క్రోధ, మద మత్సర్యాలను, పంచేంద్రియాలను అదుపులో పెట్టుకోవడం అన్నారు.ఇందూరు అయ్యప్ప ఆలయ నిర్మాణానికి గుండయ్య గురుస్వామి లాంటి ఎంతో మంది కృషి చేశారని అన్నారు. జనవరి 20 వరకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ఇందూరు అయ్యప్ప సేవా సమితి ట్రస్ట్‌ను ఆయన అభినందించారు. 80 రోజుల పాటు నిర్విరామంగా ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భక్తవత్సలం, ట్రస్ట్ సభ్యులు సురేష్, ఆగమయ్య, జగన్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

● కాశీమాత పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

నగరంలోని కోటగల్లిలో కాశీమాత విగ్రహానికి ఆదివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పూజలు చేశారు. బెంగాలీ కాళికామాతా అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. ఆదివారం ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కాళికామాతా విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించారు.

విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలని సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి అన్నారు. నిజామాబాద్‌లోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఆదివారం విశ్వబ్రాహ్మణుల సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో ప్రతిభా పురస్కారాలను అందించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ ఎంతగానో శ్రమించారని ఆయన అన్నారు. శ్రీకాంచారి తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసుకున్నారని అన్నారు. లక్ష్య సిద్ధి కోసం మహాత్ములు ఎంతటి త్యాగాలకైనా వెనుకాడరని ఆయన అన్నారు. ప్రతీ ఒక్కరు తాము ఎంచుకున్న రంగాల్లో ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థులు చదువుల్లో ప్రతిభచూపి ముందుకు పోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నిజామాబాద్ నార్త్ తహశీల్దార్ నాగార్జున, పెర్కిట్ మహిళా ప్రాంగణం మేనేజర్ పద్మతో పాటు పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్‌కుమార్, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ హరికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణచారి, కోశాధికారి శ్రీధర్, మనోహరచారితో పాటు పలువురు పాల్గొనగా 50 మందికి ప్రతిభా పురస్కారాలను అందించారు.

ఏకలవ్య గురుకులంలో ఔట్‌సోర్సింగ్

ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ఇందల్వాయి ఏకలవ్య గురుకులంలో పనిచేసేందుకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో క్యాటరింగ్ అసిస్టెంట్ (1), మెస్ హెల్పర్ (2), సానిటేషన్ (1), ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్ (1) పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. క్యాటరింగ్ విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, మెస్ హెల్పర్, సానిటేషన్ కొరకు పదవ తరగతి, ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్ పోస్టుకు పదవ తరగతితో పాటు ఐటీఐ లేదా పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు ఈనెల 12లోపు ఏకలవ్య గురుకులంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. కొత్త నిజామాబాద్ జిల్లాలో పదవ తరగతి పూర్తి చేసిన బోనాఫైడ్ ఉన్న అభ్యర్థులు మాత్రమే అర్హులనిపూర్తి మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టడం జరుగుతుందని ఇవి తాత్కాలిక ఉద్యోగాలేనని రెగ్యూలర్ ఉద్యోగాలు కావన్నారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ 8397947334 నెంబర్‌ను సంప్రదించా లన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖిల్లా, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. నగరంలోని మూడవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల నాందేవ్‌వాడకు చెందిన దత్తాద్రి కుటుంబ సభ్యులతో తన స్వగ్రామం సోలాపూర్‌కు ఈనెల 1వ తేదీన తాళం వేసి వెళ్లారు. ఇంటికి తాళం ఉన్న విషయాన్ని గమనించిన దుండగులు తాళం పగలగొట్టి లోపలికి చొరబడి ఇంట్లోని బీరువాలోగల సుమారు 3తులాల బంగారు ఆభరణాలు, నగదును అపహరించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆదివారం తాళం ధ్వంసమై ఉండడాన్ని గమనించిన ఇంటి యజమాని శివాజీ బోస్లే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. దుండగుల కోసం చుట్టుపక్కల సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దుండగుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రజలు సైతం దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని దూర ప్రాంతాలకు వెళ్లే వారు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో వివరాలు నమోదు చేసి వెళ్లాలని తెలిపారు. విలువైన వస్తువులను ఇంట్లో ఉంచి వెళ్లరాదని సూచించారు. నిజా మాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి నేతృత్వంలో రాత్రివేళ పెట్రోలింగ్‌ను ముమ్మ రం చేస్తున్నామని ప్రజలు సైతం పోలీస్ శాఖకు సహకారం అందించాలని ఎస్సై మహేష్ తెలిపారు.

పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

(ఐదో పేజీ తరువాయి)

చేయాలో తెలియకపోవడం వల్ల రైతులు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. ఖాళీ జాగలు ఉన్న చోట కొంత మంది రైతులు ధాన్యం నిల్వలు చేస్తుండగా మరికొం త మంది కొనుగోలు కేంద్రాలకు ముందుగానే వచ్చి ధాన్యం నిలువ ఉంచు తున్నారు. అక్కడే ఆరబోసి కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. గడిచిన వా రం రోజులుగా చలి పెరగడం గాలిలో తేమశాతం ఎక్కువ అవుతుండటం వల్ల ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కుప్పగా పోసి నిలువ ఉంచితే మొలక వస్తుండటంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రతీరోజు ఆరబోయడం వల్ల కూలీలు దొరకకా సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొంత మంది రైతులు వ్యాపారులకు అమ్ముతున్నా మద్దతు ధరకంటే తక్కువగా వస్తుండటం వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నారు. గడిచిన వారం రోజులుగా ఎక్కువగా వరి కోతలు జరుగుతుండటంతో ప్రస్తుతం ఆరు లక్షల మెట్రిక్ టన్ను ల వరకు ధాన్యం నిల్వలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో వారం రోజుల్లో ఇంకా బాగా పెరుగుతాయని అంచనాకు వస్తున్నారు. ధాన్యం ని ల్వలు ఉన్న గ్రామాల పరిధిలో ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రైతులు మాత్రం ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులను కలుస్తూ ఎక్కువ మొత్తంలో సేకరిం చాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో ఐటీఐలకు కొత్త కళ!

(ఐదో పేజీ తరువాయి)

ఈ అధునాతన కోర్సులు రెండు సంవత్సరాల కాలపరిమితి కలిగి ఉన్నాయి. మ్యానిఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సు ఏడాది కాల పరిమితితో ఉండగా, ఆర్టీసీయన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ కోర్సు కూడా ఏడాది కాల పరిమితితో ఉంది.

● కోర్సు పూర్తి కాగానే ఉద్యోగ అవకాశాలు

ఏటీసీ కేంద్రాల్లో విద్యార్థులకు మెరుగైన శిక్షణను అందించేందుకు అన్ని రకా లుగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. నూతన భవనాలతో పాటు రూ.32 కోట్లతో కోర్సులకు సంబంధించిన అధునాతన యంత్రాలను టాటా కంపెనీ అందించ నుంది. ఆరేళ్ల వరకు టాటా కంపెనీ కోర్సుల నిర్వహణ బాధ్యతను తీసుకుంది. కోర్సు పూర్తి చేసిన వెంటనే అప్రెంటిషిప్ కల్పించనున్నారు. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను అందించేందుకు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు కూడా నిర్వహించ నున్నారు. ప్రస్తుతం కృత్రిమ మేరకు ఆదరణ ఉన్న నేపథ్యంలో ఐటీఐలలో కొత్త కోర్సులు అందుబాటులోకి రావడం ద్వారా నేటి యువతకు కోర్సు పూర్తి కాగానే ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకు ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు కూడా కొత్త కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు అవకాశం కల్పించారు.

బోనస్ ధరతో రైతులకు ప్రయోజనం

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యేపోచారం



జల్లాపల్లి ఫారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోచారం

కోటగిరి,నవంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా రైతులకు సన్న రకం ధాన్యానికి బోనస్ ధర చెల్లిస్తుందని, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి బోనస్ ప్రయోజనం పొందాలని రాష్ట్ర వ్యవసాయ సలహదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారం గ్రామంలో ఆదివారం రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గం వరి ధాన్యం పండించడంలో ముందుంటుందని పేర్కొన్నారు. ముందస్తుగా ధాన్యం రావడంతో రైతులు ప్రైవేటుకే ఎక్కువ మొత్తంలో అమ్ముకున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు ధాన్యం ధరను పెంచి కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. బోనస్ ధరకు సమాంతరంగా ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు చెల్లిస్తే ప్రైవేటుగా అమ్ముకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు త్వరితగతిన మిల్లులకు తరలిస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, నాయకులు శంకర్ పటేల్, శంకర్, హమీద్, షేరు తదితరులు పాల్గొన్నారు.

● ఆందోళన వద్దు అండగా ఉంటాం: పోచారం

వర్ని: ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యంపై అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వ సలహదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. చందూర్ మండల కేంద్రంలో ఆదివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కష్టపడి పండించిన పంటకు కర్షకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అన్నదాతకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని కోరారు.ప్రతీ గింజకు గిట్టుబాటు ధరతో పాటు 500రూపాయల బోనస్ అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, వింగ్ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



చందూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

● ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: చంద్రశేఖర్ రెడ్డి

మోపాల్,నవంబరు 3(ఆంధ్రజ్యోతి):రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్ముకొని మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని డీసీసీబీ వైస్ చైర్మన్ చంద్ర శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బోర్గాం(పి) ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఇబ్బంది పడకుండా ఉండేందుకే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సొసైటీ పాలకవర్గం డైరెక్టర్లు, స్థానిక మాజీ ప్రజాప్రతి నిధులు చిట్టి సాయరెడ్డి, ఈగశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ జయకృష్ణ, గ్రామాల రైతులు, సొసైటీ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

● రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

బోధన్‌రూరల్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హున్సా సహకార సంఘం అధ్యక్షుడు అల్లె జనార్దన్ అన్నారు. ఆదివారం సాలూర సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి తమ ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం ధాన్యానికి 2320, బీ గ్రేడ్ రకం ధాన్యానికి 2300రూపాయలు చెల్లిస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు విక్రయించేందుకు వచ్చేటప్పుడు జిరాక్స్, ధ్రువీకరణ పత్రాలు తమవెంట తీసుకురావాలన్నారు. వ్యవసాయ విస్తీరణ అధికారి జారీ చేసిన రైతు ధృవీకరణ పత్రం పట్టాపాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు జిరాక్స్‌లు తప్పకుండా తీసుకురావాలన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అల్లె రమేష్, కేజీ.గంగారాం, సొసైటీ సీఈవో బస్వంత్ రావు, ఖాజాపూర్ అశోక్, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● యంచలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవీపేట: మండలంలోని యంచలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నాగేపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మాజీ, సాయిలు, విజయ్ కుమార్, బాబురావు, చందరి లక్ష్మణ్, రాజేశ్వర్, లాలు, సొసైటీ కార్యదర్శి రమేష్, తదితరులున్నారు.

● కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన వింగ్ చైర్మన్

మాక్లూర్: మండలంలోని డీకంపల్లి, కల్లెడి, గుత్ప, రాంచంద్రపల్లి గ్రామాల్లో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వింగ్ చైర్మన్ బూరోల్ల అశోక్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రతీ గ్రామం నుంచి ధాన్యం బస్తాలను లారీల్లో రైస్‌మిల్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో వింగ్ డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సమస్యలను పరిష్కరిస్తా

● జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి



ఆర్మూర్‌లో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్

ఆర్మూర్‌టౌన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంబి హన్మాన్ ఆవరణలో ఉన్న గ్రంథాలయాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో ఉన్న సమస్యలను, పాఠకులను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో టాయిలెట్ సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తామని, త్వరలో మొదటి అంతస్తు భవనం పనులను పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకువస్తామని అన్నా రు. పాఠకుల కోరిక మేరకు సీసీ కెమెరాల ఏర్పాటు చేయి స్తా నని అన్నారు అనంతరం ఆయనను కాంగ్రెస్ నాయకులు అ య్యప్ప శ్రీనివాస్, సాయిబాబాగౌడ్‌లు పట్టుశాలువతో ఘనం గా సన్మానించారు.

స్కౌట్ మరియు గైడ్స్ తృతీయ సోపాన

పరీక్షకు సిరికొండ విద్యార్థులు ఎంపిక



స్కౌట్స్ మరియు గైడ్స్ తృతీయ విద్యార్థులు

సిరికొండ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగే స్కౌట్స్ మరియు గైడ్స్ తృతీయ సోపాన పరీక్షకు సిరికొండ విద్యార్థులు ఎంపికయ్యా రని స్కౌట్స్ మరియు గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి సోలమన్ తెలిపారు.ఆదివారం నుంచి ఈ నెల 7వరకు జరిగే పరీక్షలకు సిరికొండ ప్రముఖ పాఠశాలకు చెందిన విద్యార్థులు అద్వైత్‌రెడ్డి,రిషీ,రమనీష్,స్నేహిత్,సాత్విక్,యువరాజ్ పటేల్ హాజరవుతున్నారని సోలమన్ తెలిపారు. పరీక్షలకు ఎంపికైన విద్యార్థులను సోలమన్, పాఠశాల హెచ్‌ఎం నర్సయ్య అభినందించారు.

టీడీపీకి అడహక్ కమిటీ నియామకం

● కన్వీనర్‌గా దేగాం యాదాగౌడ్ నియామకం

సుభాష్‌నగర్,నవంబరు 3(ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ పార్లమెంట్ అడహక్ కమి టీని పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు తెలంగాణ తెలుగుదేశం పార్టీ నేతలు నియామకం చేశారు. పార్లమెంట్ అడహక్ కమిటీ కన్వీనర్‌గా దేగాం యాదాగౌడ్‌ను నియమించారు.సభ్యులుగా దం తాల ఆనంద్‌ను నియామకం చేశారు. బోధన్ నియోజకవర్గం నుంచి అడహక్ కమిటీ సభ్యుడిగా గోపాల్‌రెడ్డి, సీహెచ్ హన్మంత్ రావును నియమించారు. నిజామాబాద్ అర్బన్ నుంచి అడహక్ కమిటీ సభ్యులుగా కర్రివినోద్‌కుమార్, రెంజర్ల సురేష్, అంబిక సత్యనారాయణ, జగిత్యాల నుంచి సోమ, కొండా శ్రీధర్, కోరుట్ల నుంచి శ్రీనివాస్‌బాబు, మస్క ప్రవీణ్, నిజామా బాద్ రూరల్ నుంచి వీరబ్ర హ్మేంద్రచారి, అర్మూల నాగేశ్వర్‌రావు, బాల్కొండ నుంచి రాజన్న, వీరాచారి, రమేష్‌లను నియామకం చేశారు.

డీవీకే విగ్రహా ఆవిష్కరణను విజయవంతం చేయండి

సిరికొండ నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి స్వర్గీయ డీ.వీ కృష్ణ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ కార్యకర్తలను కోరారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభాకర్,జిల్లా కార్యదర్శి కృష్ణ, డివిజన్ కార్యదర్శి దేవరాం,డీవీకె కూతురు దివ్య, పీవోడబ్ల్యూ టీయూసీఐ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ముత్తెన్నతో రాష్ట్ర నాయ కులు పాల్గొంటారని రామకృష్ణ చెప్పారు.

ఘన్‌పూర్‌లో రేషన్ షాపు ప్రారంభం

డిచ్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లి మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఆదివారం నూతన రేషన్ షాపును మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ ప్రారంభించారు. గ్రామస్థులకు నిత్యవసర సరుకులు సకాలంలో అందించే విధంగా చేయూతనందించాలని డీలర్ స్వాతిని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ప్లీనరీకి తరలిన నాయకులు

డిచ్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆదివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ధర్మసమాజ్ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. గత ఏడాది సరూర్ నగర్‌లో విశారధన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాన్ని స్థాపించారని వారు పేర్కొన్నారు. సబ్బండ కులాలు, పేద లక్ష్యాల లక్ష్యమని ధర్మసమాజ్ పార్టీ లక్ష్యమని పార్టీ ప్రతిని ధులు సుభాష్, మోహన్, దాసు, పోచయ్య, రాకేష్, నర్సయ్య, తదితరులు పేర్కొన్నారు.

ఎన్నాళ్లు ఈ వెట్టి బతుకులు

● ఏడో బెటాలియన్ పోలీస్ సిబ్బంది కుటుంబాల ఆవేదన



బెటాలియన్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బెటాలియన్ సిబ్బంది భార్యలు

డిచ్‌పల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఉద్యోగం అనేది ఎవరికైనా గుర్తుండే విధంగా పని చేస్తారు కానీఏడో బెటాలియన్‌లో మాత్రం ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేయడంపై వారి కుటుంబీకు లు కన్నీళ్ల పర్యంతం కావడం ఆందోళన కలిగిస్తుంది. గత రెండు రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ ముందు కుటుంబీకులు చంటి బిడ్డలతో రాస్తారోకో చేయడం బెటా లియన్‌లో జరుగుతున్న వెట్టి చాకిరి బతుకులకు నిదర్శనంగా పేర్కొనవచ్చు. క్రమ శిక్షణకు మారు పేరుగా మారుతున్న బెటాలియన్ సిబ్బంది అధికా రులకు వెట్టి చాకిరి చేయాల్సిన పరిస్థితి ఎంత వరకు సమంజసమని వారి కుటుం బీకులు 'ఆంధ్రజ్యోతి' ఎదుట కన్నీళ్ల పర్యంతం అయ్యారు. ఇప్పటి వరకు అధికారులకు ఎదురు మాట్లాడితే ఇంక్రిమెంట్ పెం డింగ్, జీతాల్లో కోతా, ప్రమోషన్ జాప్యం చేస్తున్నా రని పేరుకు ప్రభుత్వ ఉద్యోగమే కానీ తమవారు మాత్రం పోలీసు అధి కారుల ఎదుట, ఇండ్లల్లో వెట్టిచాకిరి చేయడం తమ కెంతో బాధగా ఉందని మహిళలు వాపోయారు. డిచ్‌పల్లి ఏడవ పోలీస్ బెటాలియన్‌లో 400 మంది నూతన కానిస్టే బుళ్లు, రిక్రూట్ కానిస్టేబుళ్ల విధులు నిర్వహిస్తు న్నారు. తమవారితో వెట్టిచాకిరి చేయించడం సమం జసం కాదని మైదానంలో గట్టి తీయడం, గుంతలు తీయించడం, ఇంట్లో సామాగ్రి తెచ్చి వ్వ డం తమకు నచ్చడం లేదని వెంటనే తమ వారిని ఇతర బెటా లియన్‌కు విధులు నిర్వహించేందుకు తాము అంగీకరించ బోమని వాపోయారు.

● పోలీసుల సిబ్బంది డిమాండ్లు ఇవే

రాష్ట్ర మంతా ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలి, ఎస్పీ, సీపీ కార్యాలయాలకు ఏపీఎస్ పోలీసులను అటాచ్ చేయాలి. ఏఆర్ పోలీసుల విధంగానే సివిల్ పోలీసులుగా గుర్తించాలి. విద్యార్హతను బట్టి ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. బెటా లియన్‌లో ఉన్న మెస్ కంపెనీలను ఎత్తివేయాలి.

కేటీఆర్‌కు బెటాలియన్ పోలీసుల సమస్యలను వివరిస్తున్న పోలీసు సిబ్బంది భార్యలు



కేటీఆర్‌కు సమస్యలు వివరిస్తున్న సిబ్బంది



7వ బెటాలియన్ ఇదే..

● నేడు అడిషనల్ డీజీ వద్దకు బెటాలియన్ సిబ్బంది

తమ డిమాండ్లు నెరవేర్చేవరకు తాము ఉద్యోగాల్లో కొనసాగలేమని తమకు విధుల్లో భాగంగా రాష్ట్రమంతటా ఒకే పోలీస్ విధానాన్ని కొనసాగించాలని నెలలో 26 రోజుల్లో ఐదురోజులు సెలవు ఇవ్వాలని అడిషనల్ డీజీ సంజీవ్‌కుమార్ జైన్‌ను నేడు కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు ఏడవ బెటాలియన్ సిబ్బంది ఆంధ్రజ్యోతికి చెప్పారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు.

సమగ్ర సర్వేలో ఉపాధ్యాయు అందరిని భాగస్వాములను చేయాలి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేలో కేవలం ఎస్జీటీలనే కాకుండా ఉపాధ్యాయులందరిని భాగస్వాములను చేసి దానిని తక్కువ సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్‌సీల కేటాయింపులో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ల మధ్య వేతన వ్యత్యాసం తగ్గించి మెరుగైన వేతనాలు అందించాలని కోరారు. ఎస్జీటీయూ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరుగగా ఈ సమావేశానికి హాజరైన మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ప్రతీ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని కేటాయించాలన్నారు. సీనియారిటీ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలన్నారు.

సైబర్ నేరాల అప్రమత్తంగా ఉండాలి

జక్రాన్‌పల్లి, నవంబరు3(ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సీహెచ్.తిరుపతి అన్నారు. ఆదివారం రాత్రి కలిగోట గ్రామంలో గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గంజాయి, మత్తుపదార్థాలకు యువత, ప్రజలు దూరంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతీఒక్కరు జాగ్రత్తలు పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై సుశీల్‌కుమార్, పోలీస్‌సిబ్బంది, వీడీసీసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కలిగోట్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్సై సీహెచ్.తిరుపతి

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ. 100	రూ.230	రూ. 250
వెన్‌కాబ్(కిలో)	: రూ.110	రూ.235	రూ. 255

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.82400	రూ.76000	రూ.1035

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : బూల్ బులియా-3 (హిందీ) (9.35, 4.10)
: సింగం అగేన్ (హిందీ) (1.00, 7.35, 10.45)
స్క్రీన్-2 : లక్కీ భాస్కర్ (10.00, 1.15, 4.30, 7.45, 11.00)
స్క్రీన్-3 : సింగం అగేన్ (హిందీ) (9.25)
: క (12.35, 7.15)
: భగీరా (3.50)
: బూల్ బులియా-3 (హిందీ) (10.30)
స్క్రీన్-4 : అమరన్ (9.50, 1.20, 7.25, 10.55)
: వేనం (ఇంగ్లీష్) (4.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : లక్కీ భాస్కర్ (10.40, 1.35, 7.30, 10.30)
: క (4.35)
స్క్రీన్-3 : అమరన్ (10.10, 1.20, 4.30, 7.35)
: క (10.40)

దేవి : లక్కీ భాస్కర్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అమరన్ 11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : క (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్